



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM


సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 248 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 09 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# మాజీ గవర్నర్ తమిళిసైకి పితృ వియోగం...

## ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**తెలంగాణ మాజీ గవర్నర్, భాజపా నాయకురాలు తమిళసై సౌందరరాజన్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది.**

చెన్నై, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ మాజీ గవర్నర్, భాజపా నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆమె తండ్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) (92) కన్నుమూశారు. ప్రముఖ కాంగ్రెస్ నేతగా, గాంధేయవాదిగా, గొప్ప వక్తగా పేరు పొందిన ఆయన.. వయో సంబంధిత సమస్యలతో మంగళవారం అర్ధరాత్రి 12.15గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో భాజపా నేత, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై ఒకరు. గాంధీజీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకున్న ఆయన.. పార్లమెంటులో తొలిసారి తమిళంలో మాట్లాడిన నేతగా రికార్డు నెలకొల్పారు.



తమిళ భాషా సంస్కృతుల అభివృద్ధికోసం విశేష కృషిచేశారు. కుమారి అనంతన్ మరణవార్త తెలుసుకున్న తమిళ ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, సీఎం స్టాలిన్, తమిళనాడు ప్రతిపక్ష నేత పళనిస్వామి, వి. శశికళ, పన్నీర్ సెల్వం, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై, టీవీకే చీఫ్ విజయ్ పాటు పలువురు సీపీఎం, సీపీఐ నేతలు తమిళి సై తండ్రి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. కుమారి అనంతన్ మరణం తమిళ సమాజానికి పెద్ద లోటు అన్నారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

### కుమారి అనంతన్ మరణం బాధించింది.. ప్రధాని మోదీ

తమిళసై సౌందరరాజన్ తండ్రి మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం తెలిపారు. కుమారి అనంతన్ సామాజిక సేవను కొనియాడిన ప్రధాని.. తమిళనాడు అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి గొప్పదని 'ఎక్స్'లో పేర్కొన్నారు. తమిళ భాష, సంస్కృతి ప్రాచుర్యం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. ఆయన మరణం ఎంతగానో బాధించిందన్నారు. కుమారి అనంతన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్న కుమారి అనంతన్ సేవలు చిరస్మరణీయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని, తమిళ భాష పట్ల ఎంతో మక్కువను పెంపొందించిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచి ఎంతో ప్రజా సేవ చేశారన్నారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న తమిళిసై, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



### 'క్యుములోనింబస్' ప్రభావం..

# తెలంగాణలో రెండు రోజులు వర్షాలు

**క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ, రేపు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.**

హైదరాబాద్, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ, రేపు తెలంగాణాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



ఈ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే సూచనలున్నాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయని వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటనలో పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 10న (గురువారం) రాష్ట్రంలోని సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# నా జుట్టు విష్ణు చేతుల్లోకి ఇవ్వాలనే ఈ కుట్రలు :మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు

**నటుడు మంచు మనోజ్ మీడియాతో మాట్లాడారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): కుటుంబ వివాదంతో నటుడు మోహన్ బాబు కుటుంబం తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. "నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు.



దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా" అని మనోజ్ చెప్పారు. "పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. తెల్లవారుజామున విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీపై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్ను వాళ్ళు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్ బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండి" అని మనోజ్ విజ్ఞప్తి చేశారు. "నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడెక్షన్లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీగా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా" అని మనోజ్ వ్యాఖ్యానించారు.

### మరో మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణలోనే

# పవన్ చిన్న కుమారుడు

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్కి సింగపూర్లో చికిత్స కొనసాగుతోంది.**

అమరావతి, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్కి సింగపూర్లో చికిత్స కొనసాగుతోంది. మంగళవారం అక్కడ జరిగిన అగ్నిప్రమాదంలో బాలుడి కాళ్లు, చేతులకు గాయాలు కావడం.. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సింగపూర్ వెళ్లిన పవన్.. ఆస్పత్రికి చేరుకున్నారు. మార్క్ శంకర్ను చూసిన అనంతరం వైద్యులతో ఆయన మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని.. ఊపిరితిత్తుల్లో పొగ పట్టేయడం మూలంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందులపై పరీక్షలు చేస్తున్నామని వైద్యులు పవన్కు తెలిపారు. మార్క్ శంకర్కు తొలుత అత్యవసర వార్డులో చికిత్స అందించిన వైద్యులు.. బుధవారం ఉదయం గదికి మార్చారు. మరో మూడు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచి పలు పరీక్షలు చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు.



# ఉద్దేశపూర్వకంగానే గొడవలు సృష్టించేందుకు జగన్ యత్నం:హోంమంత్రి అనిత

**రాప్తాడు పర్యటనలో కావాలనే గొడవలు సృష్టించేందుకు జగన్ ప్రయత్నించారని హోంమంత్రి అనిత విమర్శించారు.**

విశాఖపట్నం, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): రాప్తాడు పర్యటనలో ఉద్దేశపూర్వకంగానే గొడవలు సృష్టించేందుకు మాజీ సీఎం జగన్ ప్రయత్నించారని హోంమంత్రి అనిత విమర్శించారు. రెండు రోజుల నుంచే పక్కా ప్రణాళికతో వ్యవహరించారన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారంతోనే 1100 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అయినా డబ్బులిచ్చి వైకాపా కార్యకర్తల్ని భారీగా రప్పించి పోలీసులపై దాడికి దిగారన్నారు. "పర్యటన తర్వాత రోడ్డు మార్గంలో వెళ్లేందుకు జగన్ ముందుగానే నిర్ణయించుకున్నారు. ఘర్షణ సృష్టించి ఆ నెపాన్ని పోలీసులు, ప్రభుత్వంపై నెట్టేందుకే హెలికాప్టర్ నాటకం. కాసేపటికే అదే హెలికాప్టర్లో పైలట్ ఎలా వెళ్లిపోయాడు? పోలీసులపై జగన్ వ్యాఖ్యలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయి. కారుమూరి నాగేశ్వరరావు లాంటి నేతల్ని ఆయన అదుపులో పెట్టుకోవాలి. లేకపోతే ఆ పార్టీ సంఖ్యా బలం 11 నుంచి సున్నాకి పడిపోవడం ఖాయమనే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలి. రాప్తాడు ఘటనపై పూర్తి విచారణ జరిపిస్తాం" అని అనిత తెలిపారు.

# గత ప్రభుత్వంలో జే బ్రాండ్ల కారణంగా లక్షల మందికి అనారోగ్యం:కొల్లు రవీంద్ర

**గత వైకాపా ప్రభుత్వం ఎక్సైజ్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.**

తిరుపతి, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): గత వైకాపా ప్రభుత్వం ఎక్సైజ్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుపతిలోని పద్మావతి వర్సిటీలో నిర్వహించిన ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత ప్రభుత్వంలో మద్య నిషేధం హామీతో వచ్చి.. వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారని అన్నారు. కొత్త పాలసీ పేరుతో ఎక్సైజ్ వ్యవస్థ మొత్తాన్ని విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. "వైకాపా ప్రభుత్వంలో డిస్టిలరీల నుంచి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. జగన్ తీరుతో ప్రభుత్వ ఆదాయం, ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. జే బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడ్డారు. కిడ్నీ, లివర్ సమస్యలతో వేలమంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం. అత్యంత పారదర్శకంగా డ్రా నిర్వహించి మద్యం దుకాణాలు కేటాయించాం. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మారుస్తున్నాం. మొన్నటి వరకు గంజాయి అక్రమ రవాణాతో యువత జీవితాలు ఛిత్తయ్యాయి. గంజాయి నిర్మూలన కోసం ఈగల్ టీమ్లను ఏర్పాటు చేసుకున్నాం. గత ఐదేళ్ల అక్రమాలను ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారు" అని కొల్లు రవీంద్ర తెలిపారు.



### తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు..

# రేవంత్ రెడ్డి పడగొట్టారు: హరీశ్ రావు



సంగారెడ్డి, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్ రెడ్డి పడగొట్టారని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సంగారెడ్డిలోని గణేశ్ గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ సభకు రాహుల్ గాంధీ దిల్లీలో ఉండి కూడా వెళ్లలేదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు డిప్యూటీ సీఎం ఉపసంహరించుకున్నారని చెప్పారు. అంటే రేవంత్ రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా అని ప్రశ్నించారు. "అక్రమ కేసులు పెట్టినందుకు రేవంత్రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ అంతా కేసీఆర్ వైపు చూస్తోంది. ఏడాది పాలనలో ప్రజలకు అన్నీ అర్థం అయ్యాయి. 50 శాతం రుణమాఫీ కూడా కాలేదు. రైతుబంధు, రూ.4 వేల పింఛన్, మహాలక్ష్మి పింఛన్ రాలేదు. జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను కూలగొట్టారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుంది" అని హరీశ్ రావు తెలిపారు.

# కేంద్ర సహకారాన్ని అందిపుచ్చుకొని అమరావతి అభివృద్ధి:పురందేశ్వరి

**నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పై భాజపా ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు.**

అమరావతి, ఏప్రిల్ 9, (రిపబ్లిక్ న్యూస్): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై భాజపా ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వీడియో విడుదల చేశారు. "అమరావతి నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ సకాలంలో రాకపోయినా ఈ అంశానికి కట్టుబడి అమరావతిలో మౌలిక వసతుల కల్పనకుగాను కేంద్రం రూ.2,500 కోట్లు కేటాయించింది. అవుటర్ రింగ్ రోడ్డుకు రూ. 20వేల కోట్లు మంజూరు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాజపా ఇచ్చిన హామీ మేరకు ప్రపంచ బ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్లు ఏపీకి ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు ఏపీకి ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1,400 కోట్లు అందిస్తుంది. రూ.15వేల కోట్ల మొబిలైజేషన్లో 25 శాతం గ్రాంట్గా కేంద్రం ఇస్తుంది. ఇందులో భాగంగా ఇటీవల కేంద్రం రూ.4,285 కోట్లు అందించింది. కేంద్ర సహకారాన్ని అందిపుచ్చుకొని, నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. అమరావతిని అభివృద్ధి చేయాలి" అని పురందేశ్వరి పేర్కొన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## అజిత్‌ను కలిశాక నా జీవితం మారిపోయింది

# 'గుడ్ బ్యాడ్ అగ్లీ' దర్శకుడు

అజిత్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' దర్శకుడు అధిక్ రవిచంద్రన్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన అజిత్ గురించి మాట్లాడారు.



అజిత్‌ను కలిసిన తర్వాత తన జీవితమే మారిపోయిందన్నారు. దర్శకుడు అధిక్ రవిచంద్రన్. ఆయన తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అజిత్పై ప్రశంసలు కురిపించారు. "22 ఏళ్ల దర్శకుడిగా తొలి సినిమాను తెరకెక్కించాను. ఆ తర్వాత ఓ సినిమా (అన్బానవన్ అసరాధవన్) ఫ్లాప్ అయింది. ఆ సమయంలో అజిత్ తప్ప నాకెవ్వరూ ధైర్యం చెప్పలేదు. ఆయన ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటినుంచి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అర్థమైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెరకెక్కించే సమయంలో ఆయన గురించి మరింత తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన చుట్టూ ఉండే వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. ఆయన ఒక లెజెండ్. ఎవరినీ బాధపెట్టరు. ఎవరి గురించి చెడుగా మాట్లడరు. ఆయన కోసం ఎన్నో కాస్ట్యూమ్స్ తయారుచేశాం. వాటిని ఎంతో ఓపికగా ధరించారు" అని చెప్పారు. అజిత్కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కోసం సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. అజిత్, త్రిషల మధ్య సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలోని 'గాడ్ బ్లస్ 'యూ' అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం విడుదల చేసింది.

## 'క్రిష్ 4'లో హృతిక్ త్రిపాత్రాభినయం.. నటీనటులు వీరే!

'క్రిష్4'లో నటించనున్న తారల వివరాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇందులో హృతిక్ త్రిపాత్రాభినయంలో కనిపించనున్నారట.




బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ నటించిన చిత్రాల్లో 'క్రిష్'కు ప్రేక్షకుల్లో విశేష ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రానికి కొనసాగింపుగా 'క్రిష్ 3' తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. ఈ ఫ్రాంచైజీలోనే 'క్రిష్ 4' రానుంది. దీనికి హృతిక్ రోషన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రకటించినప్పటి నుంచి దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. అవేంటంటే.. ఈ సినిమాలో హృతిక్ త్రిపాత్రాభినయంలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. హీరో పాత్రతో పాటు విలన్ గానూ కనిపించనున్నారట. బాలీవుడ్లోని అగ్ర నటీనటులు ఇందులో భాగం కానున్నారట. ప్రీతి జింటా, ప్రియాంక చోప్రా, వివేక్ ఒబెరాయ్, రేఖ ఇందులో నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అలాగే ఓ కీలక పాత్రలో నోరా ఫతేహి కనిపించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ఇందులో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఒక పెద్ద ప్రమాదాన్ని తప్పించడం కోసం హృతిక్.. గతం, భవిష్యత్తుల్లో ప్రయాణం చేస్తారని.. అదే కథాశంతో ఈ చిత్రం రూపొందుతుందట. త్వరలోనే దీని షూటింగ్ ప్రారంభించనున్నారు. ఇక క్రిష్ సిరీస్ చిత్రాలు వరుసగా 2003, 2006, 2013 సంవత్సరాల్లో విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఫ్రాంచైజీకి ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని రూ.700 కోట్ల భారీ బడ్జెట్తో హాలీవుడ్ స్థాయిలో దీనిని రూపొందించాలని టీమ్ భావిస్తోంది.

రిపబ్లిక్ సినిమా
CINEMA

## పరోక్షంగా విజయ్ పేరు ప్రస్తావిస్తూ ప్రశ్న..

# తమన్నా ఎలా బదులిచ్చారంటే..?

'ఓదెల 2' ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా పాల్గొంటున్నారు నటి తమన్నా. ముంబయిలో జరిగిన ఈవెంట్లో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది.



'ఓదెల 2' ప్రమోషన్స్‌గా ఫుల్ బిజీగా పాల్గొంటున్నారు నటి తమన్నా. తాజాగా జరిగిన ట్రైలర్ విడుదల ప్రచార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. నటుడు విజయ్ (విజయ్ వర్మ) పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒక విలేకరి తమన్నాను ప్రశ్నించింది. దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. విజయ్ అనే పేరు ఎక్కడా రాకుండా ఆమె బదులిచ్చారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీగా 'ఓదెల 2' సిద్ధమైంది. ఈ సినిమా సరికొత్త ట్రైలర్ విడుదల కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముంబయిలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో తమన్నాతోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది. ఇందులోభాగంగా ఓ విలేకరి.. "మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమీదనైనా విజయం (హిందీలో విజయ్) సాధించాలనుకుంటున్నారా?" అని ప్రశ్నించింది. దీనిపై తమన్నా స్పందిస్తూ.. "మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నేను నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీ (మీడియా)పై ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. నేను ఏం చెబితే అదే రాసుకుంటారు" అని ఆమె సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. విజయ్ పేరు ప్రస్తావించడానికి కూడా తమన్నా ఇష్టం చూపించడం లేదని మాట్లాడుకుంటున్నారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. "జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలనుకుంటాం. ఆవిధంగా వారి నుంచి మనం సపోర్ట్ పొందుతాం. కానీ, ఆధ్యాత్మిక ప్రయాణంలో నేను ఒక విషయాన్ని నేర్చుకున్నా. ఆనందం లేదా బాధ మన చేతుల్లోనే ఉండాలి. ప్రశ్న ఏదైనా లోతుగా ఆలోచిస్తే సమాధానం కూడా దొరుకుతుంది" అని ఆమె చెప్పారు. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్'కు కొనసాగింపుగా 'ఓదెల 2' సిద్ధమైంది. ఇందులో తమన్నా శివశక్తిగా కనిపించనున్నారు. అశోక్ తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదల కానుంది. తమన్నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. ఆమె కొన్నేళ్లుగా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ విడిపోయినట్లు కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయని, అందుకే బ్రేకప్ చెప్పేసుకున్నారని తెలుస్తోంది. అయితే, బ్రేకప్ వార్తలపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1756 : బెంగాల్ రాజుగా సిరాజ్ ఉద్-దౌలా పరిపాలన ప్రారంభం.
- 1860 : మొదటిసారి మానవుని
- కంఠధ్వని యంత్రం ద్వారా రికార్డు చేయబడినది.
- 1893 : రచయిత, చరిత్రకారుడు, కమ్యూనిస్టు నాయకుడు రాహుల్ సాంకృత్యాయన్ జననం.( మ. 1963)
- 1930 : సినిమా నటుడు మన్నవ బాలయ్య జననం (మ. 2022).
- 1936 : పాలస్తీనాకు చెందిన రచయిత ఘసన్ కనాఫానీ జననం (మ.1972).
- 1948 : హింది నటి జయ బచ్చన్ జననం. (చిత్రంలో)
- 1989 : నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు ఏ.యం.రాజా మరణం (జ.1929).
- 1994 : కమ్యూనిస్టు నాయకుడు చంద్ర రాజేశ్వరరావు మరణం (జ.1915).
- 2011 : అన్నా హజారే కు ఐ.ఐ.పి.ఎం రవీంద్రనాథ్ ఠాగూర్ అంతర రాష్ట్రీయ శాంతి పురస్కారం లభించింది.


సిరాజ్ ఉద్-దౌలా


కంఠధ్వని యంత్రం


రాహుల్ సాంకృత్యాయన్



మన్నవ బాలయ్య


ఘసన్ కనాఫానీ


జయ బచ్చన్


ఏ.యం.రాజా


చంద్ర రాజేశ్వరరావు


అన్నా హజారే

రిపబ్లిక్ స్పోర్ట్స్
SPORTS

## పొట్టి కప్ ఫైనల్ సీన్ రిపీట్.. పంత్ 'మాస్టర్ ప్లాన్' వర్కౌట్!

ఓడిపోయే స్థితిలో ప్రత్యర్థి ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీయడం ఎలాగో రిషబ్ పంత్‌కు బాగా తెలుసు. కోల్‌కతా నైటైడర్స్‌తో మ్యాచ్లోనూ ఇదే చేశాడు.



12 ఓవర్లకు కోల్కతా నైటైడర్స్ స్కోరు 149/2. ఇంకా 8 ఓవర్లలో 90 పరుగులు చేస్తే ఆ జట్టుదే విజయం. ఇక్కడే లఖ్నవూ సూపర్ జెయింట్స్ వైపు మ్యాచ్ మలుపు తిరిగింది. అజింక్య రహానె (61) దూకుడు మీదున్నాడు. 13వ ఓవర్ను వేసేందుకు శార్దూల్ ఠాకూర్ సిద్ధమయ్యాడు. అదే ఊపులో ఓవర్ను వేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో.. కానీ, లఖ్‌నవూ కెప్టెన్ రిషబ్పంత్ ఉన్నట్టుండి నడుం నొప్పి అంటూ మైదానంలోనే ట్రీట్మెంట్ తీసుకోవడం మొదలు పెట్టాడు. అక్కడే ఫిజియో వచ్చి సపర్యలు చేశాడు. కాసేపటికి కోలుకోవడంతో ఆటను కొనసాగించాడు. ఈ ఓవర్ను శార్దూల్ వైడ్లతో ప్రారంభించాడు. వరుసగా ఐదు వైడ్లు వేశాడు. చివరి బంతికి రహానెను ఔట్ చేసి లఖ్ నవూకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత రమణ్ దీప్ (1), రఘువంశీ (5), వెంకటేశ్ అయ్యర్ (45), రస్సెల్ (7) వరుస ఓవర్లలో వికెట్లను సమర్పించారు. ఆఖర్లో రింకు (38లి), హర్షిత్ (10లి) పోరాడినా కోల్కతాకు ఓటమి తప్పలేదు.

### ట్రోలింగ్ మొదలైందిలా..

కోల్కతా విజయం సాధించే దిశగా వెళ్తున్న వేళ.. రిషబ్ పంత్ అలా వ్యవహరించడం వల్లే కేకేఆర్ బ్యాటర్లు ఏకాగ్రత కోల్పోయారని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్ గుర్తుకొచ్చిందంటూ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'ఫేక్ ఇంజ్యూరీ'తో పంత్ మరోసారి తన జట్టును గెలిపించాడంటూ ట్రోలింగ్ మొదలైంది. అప్పుడు కూడా పంత్ తన మోకాలి నొప్పిగా ఉందంటూ మ్యాచ్ను ఆపాడు. అప్పుడు దక్షిణాఫ్రికా విజయానికి 24 బంతుల్లో 26 పరుగులు మాత్రమే అవసరం. అక్కడ విరామం వచ్చాక సఫారీ జట్టు ఏకాగ్రతను కోల్పోయి ఓటమి పాలైంది. ఇప్పుడు కూడా ఇలానే పంత్ చేశాడని కొందరు ఫ్యాన్స్ కామెంట్లు చేశాడు. "కోల్కతా నైటైడర్స్ మ్యాచ్ ఓడిపోవడానికి కారణం రిషబ్ పంత్. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడు. అప్పటివరకు లక్ష్య ఛేదన దిశగా సాగుతోన్న కేకేఆర్ ఒక్కసారిగా కుదేలైంది. గతంలో దక్షిణాఫ్రికాపైనా ఇలానే వ్యవరించాడని రోహిత్ శర్మ ఓసారి వెల్లడించాడు" "రిషభ్ పంత్ మాస్టర్ ప్లాన్ మరోసారి బయటపడింది. ప్రత్యర్థి రిథమ్ను దెబ్బకొట్టడంలో స్పెషలిస్ట్. కోల్కతా లఖ్నవూ పోరులో పంత్ గేమ్ ఛేంజర్" "మ్యాచ్ను స్లోగా మార్చడంలో రిషబ్ పంత్కు తిరుగులేదు. గాయం పేరుతో ఆటను ఆపే నటనలో ఆరితేరిపోయాడు. ఇప్పుడు చూశాం. గతంలోనూ ఇలాంటి అనుభవం ఎదురైంది. ఇప్పుడు మరోసారి వర్కౌట్ అయింది"

## ఇంటి చిట్కాలు


# డిన్నర్‌లో ఇప్పుడు చెప్పే ఫుడ్స్ తింటే కిలోల కొద్దీ బరువు తగ్గుతారు, పైగా అన్నీ కూడా ఇంట్లోనే చేసేసుకోవచ్చు

బరువు తగ్గడానికి చాలా మంది అనేక రకాల డైట్స్ ఫాలో అవుతారు. అయితే, వీటిలోనూ కొన్ని రకాల ఫుడ్స్ తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు. ముఖ్యంగా కొన్నిఫుడ్స్‌ని డిన్నర్‌లో తీసుకుంటే త్వరగా తగ్గుతారు. అవేంటో తెలుసుకోండి.

ప్రజెంట్ చాలా మంది మెయిన్ గోల్ వెయిట్‌లాస్. ఎంత త్వరగా బరువు తగ్గితే అంత మంచిదని రకరకాల ప్రయత్నాలు చేస్తారు. ఎక్సర్‌సైజ్‌లు, డైట్స్, జిమ్స్ అంటూ రకరకాల ప్లాన్స్ చేస్తుంటారు. ఇందులో భాగంగానే బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు కేలరీలని తగ్గిస్తారు. రాత్రిపూట ఎక్కువగా ఫుడ్ తీసుకోరు. అయితే, మనం వెయిట్‌లాస్‌లో రాత్రి డిన్నర్ కూడా కీ రోల్ పోషిస్తుంది. సరైన ఫుడ్ తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు. అందుకోసమే అసలు డిన్నర్‌లో ఏం తింటే త్వరగా బరువు తగ్గుతారో తెలుసుకోండి.



### శనగల సలాడ్



రాత్రి డిన్నర్‌లో శనగల సలాడ్ కూడా బెస్ట్ ఆప్షన్. శనగపప్పులో ప్రోటీన్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో కేలరీలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఉడికించిన శనగల్లో సన్నగా తరిగిన ఉల్లిపాయ, టమాట, దోసకాయ, కొత్తిమీర తరుగు కలిపి సలాడ్ చేసుకుని తినొచ్చు.

### కిచిడి



దీనికోసం మీరు పెసరపప్పు, శనగపప్పు దేంతోనైనా చేసుకుని తినొచ్చు. ఇందులో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఈజీగా జీర్ణమవుతుంది కూడా. పప్పులో చిరుధాన్యాలు యాడ్ చేసి తీసుకోవచ్చు.

### ఓట్స్ ఇడ్లీ



మీరు ఈవెనింగ్ ఇడ్లీ తినాలనుకుంటే దానిని ఇంకా హెల్దీ అండి వెయిట్‌లాస్ ఫ్రెండ్లీగా తీసుకోవచ్చు. దీనికోసం ఓట్స్‌తో ఇడ్లీ తయారుచేసి తినొచ్చు. ఓట్స్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతోపాటు ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీరు త్వరగా బరువు తగ్గుతారు.

### రాగి దోశ



రాత్రిపూట చాలా మంది చపాతీలు తింటారు. అయితే, కొన్నిరోజులు దోశలు అది కూడా బియ్యంతో చేసినవి కాకుండా రాగిపిండితో చేసిన దోశలు తినండి. అందులో కూరగాయలు కలిపి తినండి. రాగుల్లో ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది కడుపు నిండుగా ఉంచుతుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. దీని వల్ల బరువు ఈజీగా తగ్గుతారు.



గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.



